నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, శనివారం 15 మార్చి 2025 | JANAGAON

## మళ్లీ పెద్దపులి సంచారం..



పులి పాదముద్రలను సేకరిస్తున్న ఎఫ్ఆర్వో నరేశ్

కాటారం/పలిమెల, మార్చి 14: మళ్లీ పెద్దపులి సందచరిస్తున్నది. కాటారం మండలం మేడిపల్లి మీదుగా భూపాలపల్లి మండలంలోని రాంపూర్ అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. దీంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నరేశ్, అటవీశాఖ అధికారులు సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. అటవీ ప్రాంతంలోకి ప్రజలు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. అదేవిధంగా పలిమెల మండలంలోని పంకెన, లెంకలగడ్డ అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు, పెద్ద రేగడి, తొలమోని కుంట సమీపంలో ఆనవాళ్లు గుర్తించినట్లు పశువుల కాపరి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో నరేశ్, ఎఫ్ఎస్వో సంపత్, ఎఫ్బీవో సరిత ఉన్నారు.

## కోలాహలంగా కోటంచ

**పెద్ద రథంపై స్వామివారి ఊరేగింపు**

రేగొండ,మార్చి 14 : రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర శుక్రవారం రాత్రి పెద్దరథంపై స్వామి వారి ఊరేగింపు అనంతరం బోనాలు, బండ్లు, వాహనాలు తిరగడంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామి వారి రథయాత్ర కనులపండువగా సాగింది. వేలాది మంది భక్తులతో పాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వామి వారి రథాన్ని లాగారు. జాతర ఉత్సవాలను చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఈవో మహేశ్కూమార్, ధర్మకర్తలు సుదర్శన్, శ్రీధర్, ఓంకార్, జోగేందర్, తిరుతిరావు, రఘుపతి, రమేశ్, ఐలయ్య, సంపత్ పర్యవేక్షించారు.



స్వామి వారి రథయాత్ర



# రంగేసి.. చిందేసి

- అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేడుకలు
- వాడవాడలా యువత కేరింతలు
- డీజే నృత్యాలతో దద్దరిల్లిన పల్లె, పట్నం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, అధికారులు

*ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. శుక్రవారం వేకువజాము నుంచే ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకొన్నారు. పల్లెలు, పట్నాల్లోని వీధులన్నీ రంగులమయమయ్యాయి. ఉదయం నుంచే చిన్నారులు రంగుల డబ్బాలతో దర్శనమిచ్చారు. యువతీయువకులు కేరింతలు కొడుతూ సందడి చేయగా, చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకొని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. డీజే పాటలు, బ్యాండ్ మోతలు హోరెత్తగా, డ్యాన్స్ల జోరు కనిపించింది. ఆయా జిల్లాల్లో కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, అధికారులు సిబ్బందితో కలిసి సంప్రదాయ రంగులు చల్లుకున్నారు.*

*- నమస్తే నెట్వర్క్*





కాకతీయ విశ్వవిద్యాలయంలో హోలీ ఆడుతున్న విద్యార్థులు



బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం వరంగల్ నగర శివారులోని స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు తన్నీరు హరీశ్రావు, ఎర్రబెల్లి దయాకర్రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్రెడ్డి, నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్కుమార్

# రజతోత్సవ సభకు ఏర్పాట్లు

- దేవన్నపేటలో స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్రావు
- గతంలో రెండు చోట్ల పరిశీలన
- నేషనల్ హైవే పక్కనున్న స్థలం అనుకూలమని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు

వరంగల్, మార్చి 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ నిర్వహణ కోసం ఏర్పాట్లు మొదలయ్యాయి. వరంగల్ నగర శివారులోని దేవన్నపేట, కోమటిపల్లి పరిసరాలను మాజీ మంత్రి హరీశ్రావు శుక్రవారం పరిశీలించారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్రెడ్డి, నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ పాల్గొన్నారు. హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ స్థలంలో సభ నిర్వహణకు అనుకూలం గా ఉంటుందని బీఆర్ఎస్ సీనియర్ నేతలు భావిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వరంగల్ నగరానికి వచ్చే వారికి ఈ జాతీయ రహదారితో అనుసంధానమయ్యే రవాణా వ్యవస్థ ఉన్నదని అభిప్రాయపడ్డారు. రజతోత్సవసభకు వచ్చే లక్షాలాది జనం రవాణా, తాగునీరు, ఇతర విషయాల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు బీఆర్ఎస్ నే తలు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో, ప్రత్యేక రాష్ట్రంలోని సెంటిమెంట్గా ఉంటున్న వరంగల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభను లక్షలాది మందితో వరంగల్లో ఏప్రిల్ 27న నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ ఈనెల 7న నిర్ణయించారు. సభ ఏర్పాట్లు, బహిరంగ సభ వేదిక ఎంపిక కోసం మాజీ మంత్రి హరీశ్రావు ఈ నెల 10న వరంగల్ నగర శివారులోని భట్టుపల్లి, ఉనికిచర్ల స్థలాలను పరిశీలించారు. శుక్రవారం మరోసారి వరంగల్కు వచ్చి బహిరంగసభ నిర్వహణకు అనుకూలంగా ఉండే స్థలాలను పరిశీలించారు.

# కాంగ్రెస్లో గ్రూపుల బలప్రదర్శన



కడవెండిలో శోభాయాత్ర నుంచి పెద్ది కృష్ణమూర్తిని తీసుకెళ్తున్న సీఐ మహేందర్రెడ్డి

- కడవెండిలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి సాక్షిగా వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన లొల్లి

దేవరుప్పుల, మార్చి 14: కాంగ్రెస్లో గ్రూపు తగాదాలు పరాకాష్టకు చేరి ఎమ్మెల్యే ఎదుట బలప్రదర్శనకు వేదికగా మారిన ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలోని వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి జాతరలో వెలుగు చూసింది. కడవెండిలో వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి జాతరలో శుక్రవారం స్వామివారి శోభాయాత్ర ప్రారంభం కాగా, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరు కాగా, వారి సమక్షంలోనే కాంగ్రెస్లో రెండు గ్రూపుల లొల్లి కనిపించింది. కాంగ్రెస్ పార్టీ దేవరుప్పుల మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి వర్గం–ఝాన్సీరెడ్డి మధ్య వివాదం నెలకొని కృష్ణమూర్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా వానకొండయ్య లక్ష్మీ నర్సింహస్వామి జాతరకు నువ్విక్కడికి ఎందుకు వచ్చావని పెద్ది కృష్ణమూర్తిని ఓ లీడర్ ప్రశ్నించగా, అతని మీదకి పెద్ది వర్గం దూసుకువెళ్లింది. ఇరువర్గాల మధ్య గొడవను చూసిన పాలకుర్తి సీఐ మహేందర్రెడ్డి, స్థానిక ఎస్సై సృజన్కుమార్ వెంటనే కృష్ణమూర్తిని వారించి, ఇక్కడ ఉండొద్దని, జాతరలో లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తుందని సర్ది చెప్పారు. తాను గ్రామస్తుల పిలుపుతోనే జాతరలో పాల్గొనడానికి వచ్చానని, శోభాయాత్రతో పాల్గొంటానని తెలుపగా, రెండు గ్రూపుల మధ్య గొడవకు తావివ్వొద్దని పోలీసులు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అనంతరం ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పోలీసుల రక్షణ మధ్య స్వామి వారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలను తీసుకు వెళ్లారు. కడవెండిలో నివురుగప్పిన నిప్పులా ఉన్న కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలు ఈ జాతరతో బట్టబయలయ్యాయని ప్రజలు చర్చించుకున్నారు.

# బాలికలే టార్గెట్

- కొందరు యువకులతో కలిసి కిడ్నాప్ చేస్తున్న కి'లేడీ'
- అమ్మాయిలకు డ్రగ్స్ ఇచ్చి లైంగిక దాడి
- పోలీసుల అదుపులో నిందితులు?

కరీమాబాద్, మార్చి 14: నగరంలో కొంతకాలంగా బాలికలను కిడ్నాప్ చేస్తున్న కిలేడీ అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. బడీడు బాలికలను టార్గెట్ చేసి కిడ్నాప్నకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అనంతరం బాలికలకు మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక దాడి చేయిస్తున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ కొంతకాలంగా వరంగల్ మిల్స్కాలనీ పోలీస్స్టేషన్ పరిధిలో నివాసముంటున్నది. డ్రగ్స్కు బానిసైన ఇద్దరు మహిళలతోపాటు మరికొందరు యువకులు ముఠాగా ఏర్పడ్డారు. ఎక్కువ పాఠశాలలు, సంపన్నులు ఉండే కాలనీల్లో రెక్కీ నిర్వహిస్తారు. అనంతరం ఎవరిని కిడ్నాప్ చేయాలో ఎంచుకుంటారు. తర్వాత కిలేడీతోపాటు మరో అమ్మాయి బాలికల వద్దకు వెళ్లి పరిచయం చేసుకుంటారు. ప్లాన్ ప్రకారం వారిని కిడ్నాప్ చేస్తారు. వెంటనే బాలికలు స్పృహ కోల్పోయేలా డ్రగ్స్ ఇస్తారు. ఆ తర్వాత ముఠాలో ఉన్న యువకులు, వారికి తెలిసిన మరికొందరికి బాలికలను అప్పగిస్తారు. మత్తులో ఉన్న వారిపై లైంగిక దాడి చేస్తారు. అనంతరం వారిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేసి వెళ్లిపోతారు. ఇలా ఏడాదిన్నరగా ముఠా కిడ్నాప్లు చేస్తున్నట్లు తెలిసింది.

***తల్లిదండ్రుల ఫిర్యాదుతో వెలుగులోకి..***

మిల్స్కాలనీ పోలీస్స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ బాలిక కిడ్నాప్నకు గురైంది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల తర్వాత బాలిక తిరిగి ఇంటికి వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలికను విచారించగా అసలు విషయం బయటకొచ్చింది. తనను ఓ మహిళ వాహనంలో ఎక్కించి తీసుకెళ్లిందని, తర్వాత ఏం జరిగిందో తెలియదని చెప్పింది. మెళకువ వచ్చిన తనను ఇక్కడ వదిలేసి వెళ్లారని తెలియజేసింది. బాలికకు వైద్య పరీక్షలు చేయగా డ్రగ్స్ ఇచ్చినట్లు గుర్తించారు. బాలిక చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు ఆరా తీసి ముఠాలోని ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**కాంగ్రెస్ సర్కారు తీరుపై** బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. జగదీశ్రెడ్డి సస్పెన్షన్కు నిరసనగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు హనుమకొండ జిల్లా కాజీపేట, ములుగు జిల్లా ఏటూరునాగారంలో ధర్నా చేసి, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి యత్నించాయి. పోలీసులు అడ్డుకోగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తోపులాట జరిగింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. ఖాకీలు వారిని బలవంతంగా అక్కడి నుంచి లాగి పడేసి అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీలో ప్రభుత్వం సస్పెండ్ చేయడం సరికాదని పేర్కొన్నారు. - కాజీపేట/ ఏటూరునాగారం



ఏటూరునాగారం: బీఆర్ఎస్ శ్రేణుల నుంచి దిష్టిబొమ్మను లాక్కుంటున్న పోలీసులు



కాజీపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

# కాంగ్రెస్ తీరుపై బీఆర్ఎస్ ఆందోళన

- కాజీపేట, ఏటూరునాగారంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన గులాబీ శ్రేణులు.. అరెస్టు చేసిన ఖాకీలు

## జగదీశ్రెడ్డి సస్పెన్షన్పై నిరసన

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేసినందుకు నిరసనగా హనుమకొండ బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో పార్టీ శ్రేణులు శుక్రవారం ధర్నా, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. రోడ్డుపై బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి వ్యతిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేశ్ మాట్లాడుతూ వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి మాటలకు 90% శాతం మోసపోయారని, తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారన్నారు. రేవంత్రెడ్డికి పాలనపై అవగాహన లేదని, కల్లిబొల్లి మాటలు చెప్పి అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను వంచించారన్నారు. సీఎంపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. జగదీశ్వర్ రెడ్డిపై సస్పెన్షన్ను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకు ఇచ్చి హామీలను అమలు చేయా లని, లేకుంటే బీఆర్ఎస్ పార్టీ ప్రజా పోరాటం మొదలు పెడుతుందని హెచ్చరించారు. కార్యక్ర మంలో బీఆ ర్ఎస్ నాయకులు బుర్ర జనార్దన్ గౌడ్, గబ్బెట శ్రీనివాస్, పాలడుగుల శివకుమార్, కాటాపురం రాజు, తేలు సారంగపాణి, అఫ్జల్, మహ్మద్ సోని, హుస్సేన్, సుంచు అశోక్, శృంగా రపు భిక్షపతి, మహమూద్, వినయ్, సుంచు రఘురాం, దువ్వ నరేశ్, మర్యాల కృష్ణ, పాము రాజేశ్, సుబ్బు, మల్లేష్, మైలారం శంకర్, తండమల్ల వేణు, బండి రాంచందర్, శేఖర్, బాచీ, బొల్లె కుమార్, బస్వ యాదగిరి, కోటీ, సిద్దు, మంద శ్రీనివాస్, రాజ్కుమార్, ఇమ్మడి రవి, సిరి పాక కుమారస్వామి, వెంకట్ స్వామి, విజయ్, బాబు రావు, మోజెస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో నిరంకుశ వైఖరి


**బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారావు**

బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మి నర్సింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరంకుశ వైఖరి అవలంబిస్తున్నదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. అసెంబ్లీలో స్పీకర్ను ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడకున్నా సస్పెండ్ చేశారన్నారు. చర్చ జరిగితే కాంగ్రెస్ మోసం చేసే బండారం బయట పడుతుందని, బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుందనే భయంతోనే గొడవ చేసి జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేశారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం మండల శాఖ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్కుమార్, ఖాజాపాషా, తాడూరి రఘు, ఈసం రామ్మూర్తి, వలీబాబా, గండపెల్లి నర్సయ్య, మాదిరి రామయ్య, లొటపెట్టల రాజేశ్, జాడి భోజారావు, వావిలాల పోషాలు, కొండాయి చిన్ని, ముస్తాఫా, మెరుగు వెంకటేశ్వర్లు, శ్రీరాం, రమేశ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కాజీపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

- అడుగంటుతున్న సాగునీటి జలవనరులు
- చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతుల ఆపసోపాలు
- చుక్కనీరు లేక చెరువులు, చెక్డ్యాంల వెలవెల
- పనిచేయని చలివాగు లిఫ్ట్ ఇరిగేషన్లు
- డీబీఎం-38 కాల్వలో పిచ్చిమొక్కలు
- ఎడారిలా మారిన గోదావరి
- చిన్న కాళేశ్వరానికి మోక్షమెప్పుడో..?



నీళ్లు లేక ఎడారిలా మారిన గోదావరి

# ఆయకట్టు ఎండి.. ఆశలు అడుగంటి..

**సర్కారు నిర్లక్ష్యం.. యాసంగి రైతులకు శాపం**

*కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం యాసంగి రైతులకు శాపంగా మారుతున్నది. పాలకులకు సరైన ప్రణాళిక.. ముందుచూపు లేక చిన్నా, పెద్ద సాగునీటి జలవనరులు ఎండిపోతుండగా, ఆయకట్టు రైతుల ఆశలు అడుగంటిపోతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చివరి దశలో ఉన్న పంటలకు జీవిగంజి పోయలేక, ఎండుతున్న పంటలను చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.*

*–జయశంకర్ భూపాలపల్లి, మార్చి 14 (నమస్తే తెలంగాణ)*

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జల వనరులు అడుగంటిపోతుండడంతో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. జిల్లా లో 586 చెరువులుండగా 55,301 ఎకరాల ఆయకట్టు ఉన్నది. వీటిలో 365 చెరువుల్లో 20 శాతం వరకు నీరు అడుగంటింది. భూపాలపల్లి డివిజన్లో పది చెక్డ్యాంలు ఉండగా మొగుళ్లపల్లి మండలంలోని మూడు చెక్డ్యాంలలో మాత్రమే 25 శాతం నీళ్లు ఉన్నాయి. అలాగే గణపసముద్రం, భీంఘన్పూర్ చెరువుల్లో మాత్రమే నీరు పుష్కలంగా ఉండి రైతులను ఆదుకుంటున్నాయి. అలాగే కాటారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 70 చెరువులుండగా 42 చెరువులు పూర్తిగా నీరు లేక ఖాళీగా ఉన్నాయి. 28 చెరువులు 25 శాతం నీటితో ఉన్నాయి. ఈ డివిజన్లో ఎలాంటి చెక్డ్యాంలు లేవు.

***లిఫ్టుల మరమ్మతు గాలికి..***

జిల్లాలోని చలివాగు వెంట నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్లను సర్కారు గాలికి వదిలేసింది. చెల్పూర్, మోరంచపల్లి, ఒడితెల, నైన్పాక, సుబ్బక్కపల్లిలోని లిఫ్ట్ ఇరిగేషన్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. మోరంచపల్లి గ్రామంలో వరదలకు నీట మునిగిన లిఫ్టు ఇరిగేషన్ మోటర్లకు ప్రభుత్వం మరమ్మతు చేయించకపోవడంతో రైతులు నాలుగు సీజన్లు పంటలను కోల్పోయారు. ఇటీవలే లిఫ్టుకు మరమ్మతు చేయించినా, అప్పటికే రైతులు నీళ్లు వచ్చే పరిస్థితి లేదని పంటలు వేయలేదు. మిగిలిన లిఫ్ట్లకు సైతం మరమ్మతు చేయిస్తే మోరంచ ద్వారా వచ్చే నీటితో సుమారు 2 వేల ఎకరాలకు పైగా పంటలు సాగయ్యేవని రైతులు చెబుతున్నారు.

### చిన్న కాళేశ్వరానికి మోక్షమెప్పుడో?


ఇక చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్మించింది. 14 చెరువులు నింపి 45,742ఎకరాలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం 70శాతం పూర్తి చేసింది. పలు అనుమతుల్లో జాప్యం జరగడంతో మిగిలిన 30శాతం పనులు పెండింగ్లో ఉండిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో పనులు పూర్తి కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ఫాస్టాగ్ ప్రాజెక్టుగా చేపట్టి పూర్తి చేస్తామని మంత్రులు చెప్పిన మాటలకు ఏడాది దాటింది. చెరువుల మరమ్మతు కొనసాగుతూనే ఉన్నది. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయిస్తే యాసంగిలో 45,742 ఎకరాలకు సాగునీరు అందేది.

### డీబీఎం- 38తో 45వేల ఎకరాలకు..

డీబీఎం –38 కాల్వతో రేగొండ, గోరికొత్తపల్లి, చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన సుమారు 45వేల ఎకరాలు సాగులోకి వచ్చేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు డీబీఎం–38 కాల్వకు మరమ్మతు చేయించి సాగునీరు అందించింది. అప్పటి నుంచి డీబీఎం కాల్వ నీరు లేక నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం ఈ కాల్వలకు మరమ్మతు చేయించి నీరు అందిస్తే 45వేల ఎకరాలు సాగులోకి వచ్చేది. బావులు, బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉండేవి.

### ఎడారిలా గోదావరి..

కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం రిపేర్ చేయకుండా పక్కన పెట్టడంతో నీరు కిందికి వెళ్లి గోదావరి ఎడారిలా మారింది. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటి వరకు 2,861 టీఎంసీల నీరు దిగువకు వృథాగా వెళ్లిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తే మల్హర్, కాటారం, టేకుమట్ల, చిట్యాల మండలాల్లో నీళ్లు పుష్కలంగా ఉండేవి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు సాగునీటికి తండ్లాడుతున్నారు.



మోరంచలో ప్రవహిస్తున్న నీరు